క్లుప్తంగా

యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

గుంతకల్లు రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే ఏ రంగంలోనైనా రాణించే అవకాశం ఉంటుందని శ్రీశంకరానందగిరి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్, ప్రిన్సిపాల్ గోపాల్ పేర్కొన్నారు. కళాశాలలో చివరి సంవత్సరం బీబీఏ చదువుతున్న కట్టా కిరణ్ గిరినాథ్ అనే విద్యార్థి సాఫ్ట్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ ఉద్యోగానికి ఎంపికైన నేపథ్యంలో శుక్రవారం కళాశాలలో అతడికి అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

గుంతకల్లు రోటరీక్లబ్ అధ్యక్షుడిగా శ్రీకాంత్



శ్రీకాంత్



రేణుక

గుంతకల్లుటౌన్: రోటరీక్లబ్ పట్టణ నూతన అధ్యక్షుడిగా జి.శ్రీకాంత్ నియమితులయ్యారు. శుక్రవారం స్థానిక రోటరీక్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీనియర్ రొటేరియన్లు డాక్టర్ రామ్మూర్తి, ప్రదీప్‌కుమార్‌లు రోటరీ, ఇన్నర్‌వీల్‌క్లబ్ నూతన కమిటీని ప్రకటించారు. రోటరీ అధ్యక్షుడిగా శ్రీకాంత్, కార్యదర్శిగా జి.శివానంద ఏడాది పాటు ఆయా బాధ్యతల్లో కొనసాగనున్నట్లు వారు పేర్కొన్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలిగా ఎం.రేణుక, కార్యదర్శి వరలక్ష్మి ఎంపికైనట్లు తెలిపారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలోసామాజిక సేవాకార్యక్రమాలు, ఉచిత వైద్యశిబిరాలు, పర్యావరణ పరిరక్షణతో పాటు నిరక్షరాస్యత నిర్మూలనే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు. సమావేశంలో రొటేరియన్లు వీఎల్.గుప్త, డిష్‌రాము, త్రిస్లా బన్సాలీ, శాంత పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలు

గుంతకల్లు: స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో అనంతపురం జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు జిల్లా స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి ఆర్.మేరీ జ్యోతీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి దాదాపు 150 మందికిపైగా క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.


భోగాలకట్టలో వైద్య సేవలు



మంచానికే పరిమితమైన వృద్ధురాలికి 104 వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అప్పయ్య

యాడికి: మండలంలోని భోగాలకట్ట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్య సేవలు అందించారు. ఈసందర్భంగా 70 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులను అందజేశారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలు గ్రామీణ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోందని రాయలచెరువు పీహెచ్ డాక్టర్ అప్పయ్య చెప్పారు. గ్రామంలో మంచానికే పరిమితమైన ఐదుగురి ఇంటి వద్దకు వెళ్లి డాక్టర్ అప్పయ్య వైద్య సేవలు అందించారు. పీహెచ్ఎన్ సుమతీ దేవి, ఏఎన్ఎం సుజాత, 104 సిబ్బంది అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



పామిడిలోని ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ వెంకటరాముడు

పామిడి: పట్టణంలోని పలు విత్తన, ఎరువుల దుకాణాలను శుక్రవారం గుత్తి ఏడీఏ ఎం వెంకటరాముడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన దుకాణాల్లోని స్టాకను, విక్రయాలు, సోర్స్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆగ్రో లైఫ్ సైన్స్ కార్పొరేషన్ షాపులో పత్తి విత్తనాలకు సంబంధించి డీలర్ సోర్స్ సర్టిఫికెట్, ఇన్వాయిస్ బిల్లు చూపలేదు. దీనికితోడు భౌతిక నిల్వకు, పుస్తక నిల్వకు వ్యత్యాసాన్ని గుర్తించారు. దీంతో ఏడీఏ ఆ బీటీ-2కు సంబంధించి రూ 2,53,324 విలువ చేసే 298 ప్యాకెట్ల పత్తి విత్తనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఏఓ డీ లీనా వసుంధర, ఏఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు రక్ష.. జగనన్న సురక్ష



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భవాని, చిత్రంలో వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, కమిషనర్ మల్లికార్జున



తాడిపత్రి టౌన్: పాత మున్సిపల్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వీక్షిస్తున్న సచివాలయ వార్డు సెక్రటరీలు, వలంటీర్లు



పామిడి: జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గుంతకల్లుటౌన్: పేదలకు మేలు చేయడమే జగనన్న సురక్ష లక్ష్యమని గుంతకల్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్‌లు నైరుతిరెడ్డి, మైమూన్ తెలిపారు. శుక్రవారం ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ ద్వారా జగనన్న సురక్ష కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించిన అనంతరం వారు కాన్ఫరెన్స్‌హాల్‌లో విలేకర్లతో మాట్లాడారు. జూన్ 24 నుంచి వార్డుకు సంబంధించిన ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు గడపగడపకూ వెళ్లి సమస్య పరిష్కారానికి కావాల్సిన పత్రాలను సేకరిస్తారన్నారు. జూలై 1 నుంచి సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేసి అన్ని రకాల వినతుల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున, అసిస్టెంట్ కమిషనర్ ఎస్ఎన్.లావణ్య పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: ప్రజా సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించే క్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని జెడ్పీటీసీ కదిరప్ప పేర్కొన్నారు. శుక్రవారం దోనిముక్కల సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మాట్లాడారు. సంక్షేమ పథకాలను అందించేందుకు అవసరమైన అన్నిరకాల సర్టిఫికెట్లను దరఖాస్తు చేసుకున్న రోజునే ఎలాంటి రుసుం లేకుండా లబ్ధిదారులకు అందజేయాలన్నారు. సచివాలయ మండల కన్వీనర్ గోవిందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: పౌరసేవలను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని మండల స్పెషలాఫీసరు ఫిరోజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం యల్లనూరు సచివాలయం-2లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వినిపించారు. ఈ సందర్భంగా స్పెషలాఫీసరు మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో వారంరోజులు ఇంటింటా తిరిగి ప్రజలకు ఏం కావాలో సమాచారం సేకరించాలన్నారు. జూలై 1 నుంచి 26 వరకు జరిగే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని సర్టిఫికెట్లు పొందాలన్నారు. ఎంపీపీ గంగాదేవి, సర్పంచి పెద్ద ఓబులమ్మ, తహసీల్దారు సుమతి, ఎంపీడీఓ వీరరాజు, డిప్యూటీ తహసీల్దారు శ్వేత, హౌసింగ్ ఏఈ సుప్రజ, వీఆర్వో వినోద్ పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జూలై 5 నుంచి వార్డు సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపుల ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎలాంటి చార్జీలు వసూలు లేకుండా అందించనున్నట్లు మున్సిపల్ మేనేజర్ రాజేశ్వరీబాయి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డు సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష పథకంపై మున్సిపల్ మేనేజర్ రాజేశ్వరీబాయి, టీపీఎస్ సతీష్, సీనియర్ అసిస్టెంట్ చాంద్‌బాషా, ఆయావార్డు అడ్మిన్ సెక్రటరీలు, సెక్రటరీలు, వలంటీర్లతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఇదిలా ఉండగా వార్డు సచివాలయాల్లో జూలై 5 నుంచి 28వ తేదీ వరకు ప్రత్యేక క్యాంపులు జరగనున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఆయా వార్డు పరిధిలోని లబ్ధిదారులు 11 రకాల సర్టిఫికెట్స్ ఇస్తామన్నారు. లబ్ధిదారులు సర్టిఫికెట్స్ కోసం ఆయా సచివాలయాల్లో జరగనున్న క్యాంపు సమావేశంలో ధరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

గుత్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు మున్సిపాల్ హాల్లో వీక్షించారు. కమిషనర్ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూరబీ, వైస్ చైర్ పర్సన్ బిందె వరలక్ష్మి, మున్సిపల్ మేనేజర్ మురళీధర్, నోడల్ ఆఫీసర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, సచివాలయ ఉద్యోగులు, మెప్మా టీఎంసీ కెరన్, సీఓలు సుమన దుర్గ, సురేఖ పాల్గొన్నారు.

శింగనమల: జూలై 1 నుంచి సచివాలయ పరిధిలో తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి అన్నారు. ఈస్ట్ నరసాపురం సచివాలయంలో వలంటీర్లు, గృహసారథులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి, వారి సమస్యలు కనుక్కొని, సంక్షేమ పథకాలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందించాలన్నారు. సర్పంచ్ గోపాలరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ఎన్‌వి నారాయణ, గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, ఎంపీపీ యోగేశ్వరి, తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ నిర్మలాకుమారి, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి మాట్లాడుతూ అధికారులు, వలంటీర్లు, ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

యాడికి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించిన జగనన్న సురక్షా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంపీపీ బొంబాయి ఉమాదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యక్ష ప్రసారమైన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అన్ని శాఖ అధికారులు వీక్షించారు. జూలై 1 నుంచి జూలై 30వ తేదీ వరకు జరగనున్న జగనన్న సురక్షా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. తహసీల్దార్ అలెగ్జాండర్, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, తుట్రాళ్లపల్లి సర్పంచు సంజీవరాయుడు, ఎంపీటీసీలు రాంమోహన్ , నాగరాజు, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పామిడి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల స్పెషలాఫీసర్, హ్యాండ్లూమ్స్ ఏడీ అప్పాజీ సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో సచివాలయ సిబ్బందితో జగనన్న సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన డీ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ బీవీ శశికళతో కలిసి మాట్లాడారు. జూలై 1వ తేదీ నుంచి సచివాలయాల వద్ద ప్రజల నుంచి సేకరించిన వారి కావాల్సిన సర్టిఫికెట్లకు సంబంధించి అప్‌లోడ్ చేయించాలన్నారు. జెడ్పీటీసీ ఎల్ శోభారాణి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: జగనన్న సురక్ష కార్యక్రమను జయప్రదం చేయాలని ఎంపీడీఓ విజయ భాస్కర్ కోరారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు సచివాలయాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఈఓఆర్డీ దామోదరమ్మ పాల్గొన్నారు.

గార్లదిన్నె: జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు 11 రకాల ఉచిత సేవలు అందుతాయని మండల స్పెషలాఫీసర్ శాంతి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంతో పాటు గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఎంపీపీ వెంకటనారాయణ, తహసీల్దార్ ఉషారాణి, ఎంపీడీఓ తేజోత్స్న, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రమాదేవి

గుత్తి: అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జూలై 10,11 తేదీల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, మండల కార్యదర్శి నిర్మల, నాయకులు రమేష్, నాగరాజు, రేష్మా, గంగ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



ప్రమాద సూచనల బోర్డు ఏర్పాటు చేస్తున్న సీఐ నాగార్జునరెడ్డి

బుక్కరాయసముద్రం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని బీకేఎస్ సీఐ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వడియంపేటలోని జాతీయ రహదారిపై ప్రమాద సూచికల బోర్డులు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ నాగార్జున రెడ్డి మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులు, సరుకులు తరలించరాదన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడిపినట్లు అయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు వైఎస్సార్ సీపీ నాయకులు అనంత వెంకటరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి గాయాలు

తాడిపత్రి: పట్టణ సమీపంలోని పెన్నానది ఒడ్డున ఉన్న మైనార్టీ కేజీబీవీకి చెందిన ఇంటర్ విద్యార్థిని శుక్రవారం రాత్రి కేజీబీవీ నుంచి గోడ దూకి ఇంటికి పారిపోబోయే క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడి గాయాలపాలైంది. వివరాలు..పెద్దవడుగూరు మండలం చిన్నవడుగూరుకు చెందిన విద్యార్థిని మైనార్టీ కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరింది. శుక్రవారం మధ్యాహ్నమే సదరు విద్యార్థిని తల్లిదండ్రులు పాఠశాలలో వదిలిపెట్టి వెళ్లారు. అయితే సదరు విద్యార్థి ఇంటిపై బెంగతో రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో పాఠశాల పారిపోయేందుకు గోడను దూకే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు కిందపడి గాయాలపాలైంది. ఎస్ఓ పద్మావతి సిబ్బందితో కలసి విద్యార్థినిని ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ నాగరాజు తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు.

దాడి ఘటనలో ముగ్గురి అరెస్టు

యాడికి: ఈ నెల 20న కేశవరాయుని పేటలో రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకున్న సంగతి విదితమే. బాధితుడు నాగరాజు ఫిర్యాదు మేరకు ఎర్ర ఓబులేసు, ప్రసాదు, ఓబులేసును శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.


కుష్టు నిర్మూలనకు కృషి

యాడికి: కుష్టు నిర్మూలనకు వైద్య సిబ్బంది కృషి చేయాలని సీహెచ్ఓ జుబేదా బేగం అన్నారు. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 16 వరకు చేపట్టనున్న కుష్టు బాధితుల గుర్తింపు కార్యక్రమంపై స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది, వలంటీర్ల సాయంతో క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీహెచ్ఈఓలు శ్రీనివాసులు, ఈరన్న, పీహెచ్ఎన్ వెంకటలక్ష్మి, డీపీఎం రామచంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

పెద్దవడుగూరు: కిష్టిపాడు గ్రామంలో బైక్ విషయంపై వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేశారు. వివరాలు..గ్రామానికి చెందిన బోయ నరసింహులు తన బైక్‌ను కొన్ని రోజుల క్రితం తన అవసరాల నిమిత్తం నాగభూషణం వద్ద కుదవ బెట్టాడు. శుక్రవారం బోయ నరసింహులు నాగభూషణం వద్దకు వెళ్లి డబ్బు ఇస్తానని బైక్ ఇవ్వాలని అడిగాడు. బైక్ ఇచ్చేది లేదు ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో అంటూ బెదిరించాడు. అంతటితో ఆగకుండా బోయ నరసింహులుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



గార్లదిన్నెలో అంగన్‌వాడీ సిబ్బందికి యోగాపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

గార్లదిన్నె: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా మాస్టర్ నరేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కమ్యూనిటీ హాల్లో శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బందికి 6 రోజుల ఉచిత గర్భ యోగ విద్యపై శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్ ,ఏసియన్ బుక్ ఆఫ్ రికార్డు గ్రహీత యోగా మాస్టర్ నరేష్ మాట్లాడుతూ యోగాతో మానసిక ఒత్తిడి తగ్గి జ్ఞాపకశక్తి మెరుగు పడుతుందన్నారు. గర్భిణులు రోజూ ఆసనాలు వేయడం వల్ల సుఖ ప్రసవం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అనంతరం గర్భిణులకు యోగా ఆసనాలు, వాటితో కలిగే ఫలితాలను వివరించారు. సీడీపీఓ ఉమాశంకరమ్మ, సూపర్ వైజర్స్ వాణిశ్రీ, జ్యోతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

'వైఎస్సార్ పశుబీమా' సద్వినియోగం చేసుకోండి



బీమా పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వైఎస్సార్ పశు బీమా పథకాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని పశుశాఖ డీడీ డాక్టర్ రమేష్‌రెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్‌తో కలిసి ఆయన వైఎస్సార్ పశు భీమా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశుబీమాలో 80 శాతం ప్రభుత్వం, తెల్ల రేషన్ కార్డు కలిగిన రైతులు 20 శాతం ప్రీమియం రైతులు కట్టాలన్నారు. పశువులకు 3 ఏళ్లు, గొర్రెలకు ఒక సంవత్సరం బీమా వర్తిస్తుందన్నారు. ప్రమాదవశాత్తు పశువు మృతి చెందితే పరిహారం రైతు బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తారన్నారు. పశుశాఖ ఏడీ డాక్టర్ రత్నకుమార్, డాక్టర్ రాధిక, డాక్టర్ గోవిందరాజు, ఎంపీడీఓ విజయ భాస్కర్, స్పెషలాఫీసర్ శ్రీదేవి, సర్పంచ్ పార్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

తాడిపత్రి టౌన్: స్థానిక మెయిన్‌బజార్ ఆర్‌వీ స్వామి కల్యాణ మండపంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వాసవీ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి చంద్రమౌళి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు శంకర్ కంటి ఆస్పత్రి, తాడిపత్రి వాసవీక్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అవకాశాన్ని వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ డిల్లీశ్వరి

గుత్తి: అంగన్‌వాడీ కార్యకర్తలందరూ సమయపాలన పాటించాలని సీడీపీఓ డిల్లీశ్వరి సూచించారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను నిబంధనల మేరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సక్రమంగా అందించాలన్నారు. టీహెచ్ఆర్ తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు.

ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీ అరికట్టాలి



శవయాత్ర నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

తాడిపత్రి టౌన్: కార్పొరేటు, ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీ అరికట్టాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల విద్యా దోపిడీకి నిరసనగా శుక్రవారం స్థానిక గాంధీ సర్కిల్ నుంచి సీబీరోడ్డు మీదగా యల్లనూరు రోడ్డు సర్కిల్ వరకు విద్యాధికారుల శవయాత్ర చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఏబీవీపీ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అఖిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు, పుస్తకాలు, టై, బెల్ట్, నోట్స్‌ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారని పలు మార్లు విద్యాశాఖాధికారులకు విన్నవించిన ఎంత మాత్రం చర్యలు తీసుకోక పోగా ప్రయివేటు విద్యా సంస్థల యజమాన్యాలకే వత్తాసు పలుకుతుండటం శోచనీయమన్నారు. ఇప్పటికైనా కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని కోరారు. నాయకులు రాజు, భూపాల్‌రెడ్డి, హరినారాయణ, మనోజ్,భరత్‌యాదవ్, సునీల్‌తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రి: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 7 వ తరగతిలో 9 సీట్లు, 8 వ తరగతిలో 26 సీట్లు, 9 తరగతిలో 9 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. రిజర్వేషన్ రూల్స్ ప్రకారం ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. విద్యా ర్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులను ఈనెల 27లోపు ప్రిన్సిపాల్‌కు అందజేయాలని కోరారు. 28 న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు పాఠశాలలో పరీక్ష ఉంటుందని, అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

పామిడి: తహసీల్దార్ కార్యాలయ సమీపాన శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయాలపాలయ్యారు. పోలీసులు అందించిన వివరాలు.. పామిడి నుంచి పెద్దవడుగూరుకు, నీలూరు గ్రామాలకు ఆటోలు రెండు వేర్వేరుగా బయలుదేరాయి. తహసీల్దార్ కార్యాలయ సమీపాన ఓ లారీ ఓవర్‌టేక్ చేయబోయి నీలూరు ఆటోను ఢీ కొంది. ఆ ఆటోవెళ్లి ముందు వెళ్తున్న పెద్దవడుగూరు ఆటోను ఢీకొని కంపచెట్లలోకి దూసుకెళ్లింది. పెద్దవడుగూరు ఆటో వెళ్లి రోడ్డు డివైడర్‌ను ఢీ కొంది. ప్రమాదంలో ఆటోలోని పెద్దవడుగూరు మండలం చిన్నవడుగూరుకు చెందిన రోగన్న, లక్ష్మీదేవి, నారాయణమ్మ రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పామిడి పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు ఊపిరితిత్తుల మెగా వైద్యశిబిరం

పామిడి: స్థానిక భావసార క్షత్రియ కల్యాణమండపంలో ఆదివారం పామిడి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత ఊపిరితిత్తుల మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి, పామిడి లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లపాటి తిరుపతినాయుడు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహం 1 గంట వరకూ శిబిరంలో ప్రముఖ ఊపిరితిత్తుల వైద్యనిపుణుడు కోనా మురళీధర్‌రెడ్డి సేవలు అందిస్తారన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

తాడిపత్రి టౌన్ : తాడిపత్రి విద్యుత్ కార్యాలయం సమీపంలోని 220 కెవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈ రఘు ఓ ప్రకటనలో తెలిపారు. తాడిపత్రి పట్టణం, రాయలచెరువు, పుట్లూరు మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

సామాజిక తనిఖీ బృందానికి సహకరించాలి

పుట్లూరు: ఉపాధి హామీ పనులపై తనిఖీలు నిర్వహించే బృందానికి అధికారులు క్షేత్ర స్థాయిలో సహకరించాలని జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీపై సమావేశం నిర్వహించారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి మార్చి 2023 వరకు ఉపాధిహామీ, ఫారెస్ట్ పనుల కింద చేపట్టిన రూ.13.5 కోట్ల పనులపై తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపీఓ చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఉన్నతస్థానాలు అధిరోహించాలి



టెన్త్ టాపర్లను సన్మానిస్తున్న ఎస్ఓ గీతారాణి

శింగనమల: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నతస్థానాలు అధిరోహించాలని కేజీబీవీ ఎస్ఓ గీతారాణి సూచించారు. జగనన్న ఆణిముత్యాలులో భాగంగా కేజీబీవీ టాపర్లుగా వచ్చిన విద్యార్థినులు ఓ. ఐశ్వర్య, ఏ. చరిష్మా, పార్నపల్లి పవిత్రలను సన్మానించారు. విద్యార్థినిలకు నగదు, మెడల్, ప్రసంసాపత్రాలను అందజేశారు. ఎస్ఓ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఝాన్సీ, విద్యార్థినుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం

యాడికి: మలేరియాపై అప్రమత్తత అవసరమని మలేరియా తాడిపత్రి సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ ప్రజలకు సూచించారు. శుక్రవారం మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకొని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు శుక్రవారం రాయలచెరువులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ దోమల నివారణ చర్యల్లో భాగంగా దోమతెరలు వాడకం, కిటికీలు, తలుపులకు జాలీల ఏర్పాటు, ఇంటా, బయటా నీటి నిల్వలు లేకుండా చూడడం తప్పనిసరి అన్నారు. నీటి తొట్టెలను వారానికి ఒకసారి ఖాళీ చేసి తిరిగి నింపుకోవాలన్నారు. వైద్యుడు దేవరాజన్, షబ్బీర్, సరోజ, వైద్య ఉద్యోగులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తాడిపత్రి అర్బన్: ఎలాంటి అనుమతులు లేకుండా నందలపాడులోని పెన్నా నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. ట్రాక్టర్ యజమాని నాగరాజును అరెస్టు చేసి పట్టణ పోలీసులకు అప్పగించినట్లు సెబ్ అధికారి విజయకుమార్ తెలిపారు.

వీఆర్‌ఏల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



ప్రసాద్

పామిడి: గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పామిడి మండల వీఆర్‌ఏలు ఎన్నికయ్యారు. శుక్రవారం అనంతపురంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడుగా ప్రసాద్(గజరాంపల్లి వీఆర్ఏ), కోశాధికారిగా వై సుంకన్న(నీలూరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.